
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 25 నవంబర్ 2023
5
తిరుపతి





పదవీకాలం పూర్తయిన సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధిని వివరిస్తున్న వీసీ రాజారెడ్డి



ఘోర రోడ్డు ప్రమాద ఘటన దృశ్యాలు

రమేష్‌నాయుడు

విషాద ప్రయాణం

- ప్రైవేట్ కళాశాల బస్సు, కారు ఢీ
- నలుగురి దుర్మరణం
- ఒకరి పరిస్థితి విషమం

రమేష్‌నాయుడు, అతని భార్య పుష్ప, వదిన వనజాక్షి, దగ్గరి బంధువులు భాను, శివమ్మలతో కలిసి ఉత్సాహంగా చెన్నయ్ పెరంబూరులో శుక్రవారం ఉదయం జరిగిన నిశ్చితార్థానికి అందంగా అలంకరించుకుని వెళ్లారు. పట్టుచీరల్లో, బంగారు నగలు ధరించి వేడుకలో పాల్గొన్నారు. సాయంత్రం తిరుగు ప్రయాణం అయ్యారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రైవేట్ డిగ్రీ కళాశాల బస్సును కారు ఢీకొంది. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతదేహాలు తలలు పగిలి, మొహంపై రక్తగాయాలై కళావిహీనంగా కనిపించాయి. ఎంతో ప్రయాసతో మృతదేహాలను కారులోనుంచి తొలగించి పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషమ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న శివమ్మను తిరుపతి రుయాకు చికిత్స నిమిత్తం తరలించారు. ఎంతో సంతోషంగా నిశ్చితార్థ వేడుకకు వెళ్లి వస్తున్న ఆ కుటుంబంలో సాయంత్రం విషాదం అలముకుంది.

ప్రజాశక్తి - పిచ్చాటూరు

చెన్నయ్ పెరంబూరులో జరిగిన బంధువుల నిశ్చితార్థ వేడుకకు వెళ్లి వస్తుండగా కారును ఓ ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్రంగా గాయపడిన శివమ్మను తిరుపతి రుయాకు చికిత్స నిమిత్తం తరలించారు. తిరుపతి జిల్లా నారాయణవనం పోలీసు స్టేషన్ సమీపంలోని తిరుపతి చెన్నయ్ జాతీయ రహదారిపై సముదాయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో స్కూలు విద్యార్థులకూ స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు వెళు తున్న వాహనాన్ని అధిగమించబోయి ఎదురుగా వస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాల



శివమ్మ

బస్సును ఢీకొంది. స్థానికుల వివరాల మేరకు...

తిరుపతి -చెన్నై జాతీయ రహదారి పై శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు పుత్తూరు లోని శ్రీవిద్య ప్రైవేట్ కళాశాల బస్సు, కారు ఢీకొన్నాయి. పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం గ్రామానికి చెందిన రమేష్ నాయుడు కుటుంబానికి చెందిన ఐదుగురు పెరంబురులో నిశ్చితార్థానికి వెళ్లివస్తూ ఈ ప్రమాదంలో మృతి చెందారు. రమేష్ నాయుడు(60), అతని భార్య పుష్ప (55), సమీప బంధువు భాను (42), వదిన వనజాక్షమ్మ(60) అలియాస్ అమ్ములమ్మ సంఘటన స్థలంలో మతి చెందారు. బంధువు శివమ్మ (55) పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌నాయుడు సిమెంట్ అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ ఘటనలో భార్యాభర్తలిద్దరూ విగతజీవులయ్యారు. పుత్తూరు ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.. ఈ ఘటనలో ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులూ స్వల్పంగా గాయపడ్డారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

ప్రజాశక్తి - వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా)

సరిగ్గా నెల్లూరులో జరిగిన ఘటన లాంటిదే... చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం పచ్చికాపలం సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగింది. తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌పై కారు డ్రైవర్ దాడిచేసిన ఘటనకు సంబంధించి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అల్లెయ్య చెప్పిన వివరాల మేరకు...

తిరుపతి డిపోకు చెందిన డ్రైవర్ ఈశ్వరయ్య ఏపీ 03 జెడ్. 5302 నంబర్ గల బస్సు డ్రైవ్ చేస్తూ తిరుపతి నుంచి పళ్లిపట్టు(తమిళనాడు రాష్ట్రం)కు 50 మంది ప్రయాణికులతో వెళ్తున్నాడు. మార్గమధ్యంలో వెదురుకుప్ప మండలం పచ్చికాపల్లం సచివాలయం సమీపంలో పెట్రోల్ బంక్ దగ్గర ఎపి 03 బిపి 1584 నంబర్ గల కారు రోడ్డుపై ఆపి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఉన్నాడు. డ్రైవర్ హారన్ కొట్టి కారు పక్కన పెట్టమని చెప్పాడు. దీంతో కారు యజమాని అనుచరులతో కలిసి డ్యూటీలో ఉన్న డ్రైవర్ను కిందికి లాగి దుర్భాషలాడి పిడిగుద్దులు గుద్ది దాడి చేశారు.

ఒకరిని గుర్తించాం : ఇన్‌ఛార్జి ఎస్‌ఐ దస్తగిరి

దాడికి పాల్పడిన వారిని వీడియోలు ఆధారంగా గుర్తించాం. అతనిది మాంబేడు పంచాయతీ పరిధిలోని ధర్మాచారు గ్రామానికి చెందిన మోహన్. అనుచరులను గుర్తించే పనిలో ఉన్నాం.

ఫిర్యాదు చేసాం : తిరుపతి డిపో సిబ్బంది

ఆర్టీసీ డ్రైవర్ ఈశ్వరయ్య పై దాడి చేసిన వారిని శిక్షించాలని తిరుపతి డిపో సిబ్బంది తిమ్మారెడ్డి వెదురు కుప్పం పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఈశ్వరయ్యతో కలిసి ఫిర్యాదు చేశారు. ఇన్చార్జి ఎస్ఐ దస్తగిరి సానుకూలంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మరలా ఇలాంటి సంఘటన పునరావతం కాకుండా చూడాలని కోరారు.



ఎస్వీయూకు నాక్ 'ఏ' ప్లస్ గ్రేడ్ : వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వీ యూనివర్సిటీకి యుజిసి నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించిందని వీసీ ప్రొఫెసర్ కె రాజారెడ్డి వెల్లడించారు. యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక యూజీసీ నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ ను యూనివర్సిటీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. యూనివర్సిటీలోని వివిధ కాలేజీలు, విభాగాలు బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అత్యద్భుతమైన ప్రగతిని సాధించాయని చెప్పారు. దీనిని గుర్తించి నాక్ బందం ఏ ప్లస్ గ్రేడ్ ప్రకటించిందని తెలిపారు. ముఖ్యంగా సైన్స్ లోని ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయో కెమిస్ట్రీ తదితర విభాగాలు సుమారు రూ. 100 కోట్ల పరిశోధన ప్రాజెక్టులు నిర్వహిస్తున్నాయని చెప్పారు. యూనివర్సిటీలోని అధ్యాపకులకు మూడు దశలుగా సిఏఎస్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగోన్నతులు కల్పించామని తెలిపారు. అకడమిక్ కన్సల్టెంట్లు, టైం స్కేల్ ఎన్ ఎం ఆర్ ఉద్యోగులకు వేతనాలు పెంచామని అన్నారు. బోధనేతర ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి ఉద్యోగోన్నతి కల్పించినట్టు చెప్పారు. హోం సైన్ విభాగంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రూ. 10 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇందులో రూ. 5 కోట్లు తొలి దశ నిధులు మంజూరైనట్టు వివరించారు. ప్రత్యేకంగా పరీక్షల విభాగం భవనం రూ. 7 కోట్లుతో నిర్మించినట్టు చెప్పారు. రూ. 7 కోట్లతో బాలికల హాస్టల్, రూ. 7 కోట్లతో బాలుర హాస్టల్ భవనాల్ని పూర్తి చేసినట్టు తెలిపారు. రూ. 2.5 కోట్ల వ్యయంతో ఫార్మసీ కాలేజీ మొదటి అంతస్తు భవన నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. ఇంజనీరింగ్ కాలేజీలో పూర్వవిద్యార్థుల సహకారంతో 500 మంది అమ్మాయిలకు వసతి సదుపాయం కోసం హాస్టల్ భవనాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం- 2020 ను పటిష్టంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 110 కోట్లు అదనపు నిధులు సమీకరించి రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించవలసిన అన్ని రకాల బకాయిల్ని అందించినట్లు తెలిపారు. అకడమిక్ కన్సల్టెంట్లకు 110 అమలు చేశామని ఎస్వీయూ రిజిస్ట్రార్ వెల్లడించారు. తన మూడేళ్ల పదవీకాలంలో తనకు అన్ని విధాలుగా సహకరించిన విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులకు ఈ సందర్భంగా వీసీ రాజారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్, డీన్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మనాభం, వైస్ ప్రిన్సిపల్ శ్యామ్ డేవిడ్ మోహన్ కుమార్ రాజు, పాలకమండలి సభ్యులు మంజుల, సుమకిరణ్ పాల్గొన్నారు..

ఎస్వీయూ ఇన్‌ఛార్జి విసిగా సుందరవల్లి

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా మూడు సంవత్సరాల పదవి కాలం పూర్తి కావడంతో ఆచార్య కే. రాజారెడ్డి శుక్రవారం పదవి విరమణ చేశారు. ఆచార్య కే.రాజారెడ్డితో పాటు దాదాపుగా రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల విసిల పదవీకాలం నేటితో ముగిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో మొత్తం ఐదు విశ్వవిద్యాలయాలకు రాష్ట్రంలో ఇన్చార్జ్ విసిలను నియమించింది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు ఈ మేరకు ఉత్తర్వులు పంపించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఇన్చార్జి ఉప కులపతిగా నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వీసి ఆచార్య జిఎం సుందరవల్లిని, ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసి ఆచార్య డి. భారతిని, శ్రీ కష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్చార్జిగా యోగి వేమన విశ్వవిద్యాలయం వీసి ఆచార్య సుధాకర్ ను, కర్నూల్ రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్చార్జి ఉపకులపతిగా అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ విసి రెహమాన్ ను, ఆంధ్ర యూనివర్సిటీ కి ఆంధ్ర యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య సమతాను ఇంచార్జ్ విసి గా నియమించారు. ఇన్చార్జి విసిగా ఆచార్య జీఎం. సుందరవల్లి శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆంగ్ల విభాగానికి చెందిన ఆచార్య జిఎం సుందరవల్లి సంవత్సరం క్రితం నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా వెళ్లారు. తిరిగి ఎస్వీయూ ఇన్చార్జ్ ఉపకులపతిగా రావడం పట్ల బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు

ఉపాధ్యాయులతోనే కులగణన చేయాలి : కాంగ్రెస్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కులగణన ఉపాధ్యాయుల ద్వారానే చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షులు యార్లపల్లి గోపి డిమాండ్ చేశారు. రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యార్లపల్లి గోపి మాట్లాడుతూ కులగణన 1951 నుంచి ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కలు ప్రభుత్వ ఉపాధ్యాయులే చేసేవారన్నారు. కానీ వైసిపి ప్రభుత్వం ఉపాధ్యాయులతో కాకుండా, వాలంటీర్లతో చేయించడం ఆమోదయోగ్యం కాదన్నారు. వైసిపి గుప్పెట్లో ఉన్న వాలంటీర్లతో కులగణన చేయిస్తే కొన్ని వర్గాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు పూతలపట్టు ప్రభాకర్, షేక్ జావేద్, తేజవతి, వెంకటేష్ గౌడ్, మహేష్ రాయల్ పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్‌లో.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనను స్వాగతిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని పోలేరమ్మ ఆర్చి దగ్గర కులగణనను వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ద్వారా నిర్వహించరాదని ర్యాలీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలం తర్వాత కులగణన నిర్వహించడం సంతోషమేనని, కానీ ఉపాధ్యాయుల ద్వారా చేస్తే తప్పులు తడకలు లేకుండా సరైన సమాచారం వస్తుందని, వాలంటీర్ల ద్వారా సర్వే నిర్వహించడం మునుపెన్నడూ లేదని అన్నారు. వెంకటగిరి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గోపి, నాగభూషణం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపు తిరుమలకు మోదీ రాక

స్వాగతం పలకనున్న సిఎం, గవర్నర్
పకడ్బందీగా ప్రధాని పర్యటన ఏర్పాట్లు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తెలంగాణా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ రాష్ట్రానికి రానున్న ప్రధాని మోదీ, స్వామి కార్యమూ పూర్తి చేసుకోనున్నారు. ఈనెల 26, 27 తేదీల్లో తిరుమలలో శ్రీవారిని దర్శించుకోనున్నారు. 26న రాత్రి తిరుమలలోనే బస చేయనున్నారు. ప్రధాని మోదీకి సిఎం జగన్మోహన్‌రెడ్డి, గవర్నర్ స్వాగతం పలకనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో రాష్ట్రస్థాయి అత్యున్నత సమన్వయ సమావేశం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. తిరుపతి జిల్లా నుంచి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, జేసీ డీకె బాలాజీ, టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డిలు వర్చువల్ విధానంలో హాజరయ్యారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి వివరిస్తూ భారత ప్రధాని తిరుపతి ఇంటర్నేషనల్ విమానాశ్రయం దగ్గర దిగినప్పటి నుంచి తిరుగు ప్రయాణం వరకూ అన్ని ఏర్పాట్లూ పకడ్బందీగా చేస్తున్నామన్నారు. సంబంధిత అధికారుల సమన్వయ సమావేశం గురువారం నిర్వహించి విధులు కేటాయించామన్నారు. ఆరోగ్య శాఖ వారు స్పెషలిస్టు డాక్టర్లు ఏర్పాటు, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, 108, సేఫ్ రూమ్, తదితరాలు ఏర్పాటు, అలాగే ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ ఏర్పాటు, తగినంత లైటింగ్ ఏర్పాటు, రవాణా శాఖ వాహనాల ఫిట్నెస్ చెక్, కమ్యూనికేషన్ ప్లాన్ ఇంటర్నెట్ టెలిఫోన్ సదుపాయాలు, శానిటేషన్ ఏర్పాట్లు, అవసరమైన చోట బ్యారికేడింగ్, రోడ్డు మరమ్మత్తులు చేపట్టడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. భారత ప్రధాని పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ రానున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన ఏర్పాట్ల కొరకు అధికారులకు విధులు కేటాయించామని అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు. టీటీడీ ఈఓ మాట్లాడుతూ ప్రధాని తిరుమల చేరుకున్నప్పటి నుండి వారికి వారి సిబ్బందికి, సిఎం, గవర్నర్‌లకు వసతి, ఆహారం, దర్శనం అన్నీ ప్రణాళికా బద్ధంగా చేపడతామని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ తగినంత బందోబస్తుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

దుకాణాలు, హోటళ్లపై పోలీసుల ప్రతాపం

ప్రజాశక్తి -తిరుమల

తెలంగాణ ఎన్నికలు, త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు రిఫరెండంగా భావిస్తున్న తరుణంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. తెలంగాణ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థుల కోసం తెలంగాణాలో మరోసారి పర్యటించబోతున్నారు. ఈ నెల 25, 26వ తేదీల్లో తెలంగాణలోని వివిధ రాయకీయ సభల్లో మోదీ పాల్గొంటారు. తర్వాత తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం 26న తిరుమలకు రానున్నారు. షెడ్యూల్ ప్రకారం 26న సాయంత్రం దుండిగల్ ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతికి వస్తారు. తర్వాత రోడ్డు మార్గంలో రాత్రి 7:45కి తిరుమల చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేసి ఉంటారు. 27న తెల్లవారుజామున వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ఆ తర్వాత ఉదయం 9:30కి తిరుమల నుంచి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్తారు. అక్కడి నుంచి ఉదయం 11.30కి హకీంపేట ఎయిర్‌పోర్ట్ చేరుకుంటారు.ప్రధాని పర్యటన దష్ట్యా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు పోలీసులు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ మార్గదర్శకాల ప్రకారం టీటీడీ, పోలీసుశాఖ ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నాయి. అయితే ప్రధాని రాకతో పోలీసులు అత్యుత్సాహం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. రోడ్లుకు ఇరువైపులా ఉన్న హోటళ్లు, దుకాణాలు మూయించేస్తూ ప్రజలను బెదిరిస్తున్నారని దుకాణ దారులు వాపోతున్నారు.

నూతన ఆవిష్కరణలతో శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి -తిరుమల



విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో శాస్త్రవేత్తలుగా ఎదగాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో హోమ్ సైన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ కర్ణం అనురాధ పిలుపునిచ్చారు. టి.ఎస్.ఎన్. పురం లోని శ్రీ చైతన్య సి. బి. ఎస్.ఇ. పాఠశాలలో శుక్రవారం అంతరిక్ష పరిశోధనలో (నాసా) నూతన ఆవిష్కరణలు అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి విద్యార్థి సరికొత్త యుగానికి నూతన శాస్త్రవేత్తగా ఎదగాలని, ప్రపంచవ్యాప్తంగా మన భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని, అందుకు అవసరమైన సలహాలను ఇచ్చారు. ముఖ్యంగా విద్యార్థుల ఆలోచనా విధానంలో మార్పు రావాలని, అప్పుడే వారి ప్రవర్తన సన్మార్గంలో ఉంటుందని అన్నారు. అనంతరం అంతరిక్ష పరిశోధన నూతన ఆవిష్కరణల పోటీలో పాల్గొనే 20 మంది విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను అందజేసి ఎన్నో నూతన ఆవిష్కరణలు చేపట్టవలసిన బాధ్యత విద్యార్థుల పై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏ.జీ.ఎం. సురేష్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీ, మోహన్ బాబు, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న, డీన్ రాజశేఖర్, నాసా ఇన్చార్జి కస్తూరయ్య పాల్గొన్నారు.

రేపు తిరువన్నామలైకి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో నుంచి తిరువన్నామలైకు ఈనెల 26న ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం రాజవర్ధన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5.30, 6.00, 9.00, 9.45 గంటలకు సప్తగిరి ఎక్స్‌ప్రెస్, ఉదయం 6:30 గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సులు తిరువన్నామలైకు అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. సప్తగిరి ఎక్స్ప్రెస్ కు రాను పోను చార్జీ రూ.350 కాగా, అల్ట్రా డీలక్స్ రూ.425 చెల్లించాల్సి ఉంటుందనీ, ఓపిఆర్ఎస్ లో రిజర్వేషన్ చేసుకోవచ్చుని సూచించారు.

అందుబాటులో స్విమ్స్ పేక్లినిక్స్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

పేషంట్ల సౌకర్యార్థం సాయంత్రం వేళల్లో స్విమ్స్‌లో పేక్లినిక్స్‌ను సోమవారం నుంచి ప్రారంభించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. రోజురోజుకూ స్విమ్స్‌లో సాధారణ ఓపీ పేషంట్ల సంఖ్య పెరుగుతున్న కారణంగా వారి సౌకర్యార్థం పేక్లినిక్స్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకూ ప్రతిరోజూ సాయంత్రం 4-6 గంటల వరకు ఎంఆర్‌డి సెక్షన్‌లోని కౌంటర్ నంబర్ 6లో ఓపీ నమోదు చేసుకుని పేక్లినిక్స్ వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 2-4 గంటల మధ్య ఓపీ నమోదు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. ఫోన్ ద్వారా ఉదయం 7-8 గంటల మధ్య 0877-227777 ఎక్స్‌టెన్షన్ ఎంఆర్డి/ 2275 ఫోన్ ద్వారా సంప్రదించాలని తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, నెఫ్రాలజీ, డైరెక్టర్స్ స్పెషల్ క్లినిక్స్ అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.





యుటిఎఫ్ తిరుపతి నగర శాఖ ఎన్నిక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

స్థానిక పెద్దకాపు వీధిలోని యుటిఎఫ్ భవనము నందు శుక్రవారం సాయంత్రం తిరుపతి నగరపాలక యుటిఎఫ్ శాఖ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి దండు రామచంద్రయ్య వ్యవహరించారు. పరిశీలకులుగా బండి మధుసూదన రెడ్డి వ్యవహరించారు. యుటిఎఫ్ తిరుపతి నగర పాలక శాఖ నూతన అధ్యక్షులుగా వై హేమాద్రి బాబు, ప్రధాన కార్యదర్శిగా. ఎస్ . ఖాదర్ భాషా, కోశాధికారిగా. వి ప్రభు కుమార్ శెట్టి, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం నిర్మల బాయి, ఎం కష్ణ కుమార్, సిపిఎస్ కన్వీనర్గా ఆర్ గుణశేఖర్, వి సునీత, గౌరవ అధ్యక్షులుగా కె. వరలక్ష్మి, నగరపాలక మహిళా కన్వీనర్గా బండి యామిని, మహిళా కార్యదర్శులుగా పి కవిత, ఎం ప్రసన్నలక్ష్మి, మండల కార్యదర్శులుగా జిల్లా కౌన్సిల్ సభ్యులుగా20 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే ముత్యాల రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా నాయకులు ఎన్ మోహన్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ

తడ : మండలంలోని కాదలూరు గ్రామంలో గల మండల ప్రాథమిక పాఠశాలను శుక్రవారం మండల విద్యాశాఖాధికారి మల్లిఖార్జున రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల టెక్స్ట్ బుక్స్ అన్నీ టైటిల్స్ వారికి ఇచ్చారా లేదా అని అన్ని క్లాసుల విద్యార్థుల దగ్గర పరిశీలించారు. అదేవిధంగా వర్క్ బుక్స్ అన్ని అందరి విద్యార్థుల దగ్గర ఉన్నాయా లేదా, వర్క్ బుక్స్ విద్యార్థులు రాస్తున్నారా, వాటిని టీచర్స్ కరెక్షన్ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఒకటి రెండు పాఠాలను లెర్నింగ్ అవుట్ కమ్స్ ఏ విధంగా ఉన్నాయో పరిశీలించారు.



సుబ్రహ్మణ్యం రాజుకు ఎమ్మెల్సీచే ఘనసత్కారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



ఇటీవల మంగళం సప్తగిరి కాలనీలోని శ్రీనివాస పాఠశాల అధినేత సుబ్రహ్మణ్యం రాజు అప్సా రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం తూర్పు రాయలసీమ శాసనమండలి సభ్యులు పి.చంద్రశేఖర్ రెడ్డి స్వయంగా మంగళంకు వచ్చి సుబ్రహ్మణ్యం రాజును ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి సుబ్రహ్మణ్యం రాజు, పాఠశాల సిబ్బంది ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దష్టికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 38 లో 3 నుంచి 4 సంవత్సరాల పాఠశాల రెన్యువల్ పెంచినట్టు జీవోలో పేర్కొన్నారన్నారు. పదో తరగతి పరీక్షల దష్ట్యా ఎటువంటి డాక్యుమెంట్లుతో సంబంధం లేకుండా రెన్యూవల్ చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్సీకి విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి, ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సుబ్రహ్మణ్యం రాజు ఎమ్మెల్సీని కోరారు.

వెంకటగిరిలో విజిలెన్స్ దాడులు



ప్రజాశక్తి - వెంకటగిరి

తిరుపతి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆదేశాల మేరకు శుక్రవారం వెంకటగిరిలో విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ విజిలెన్స్ దాడులు సిఐ వెంకటరవి సిబ్బందితో కలిసి వెంకటగిరి పట్టణంలోని మార్కెట్ వీధిలో క్రాస్ రోడ్ వద్ద గల ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్, షాపులపై, బియ్యం దుకాణాలపై తూనికలు, కొలతల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఎనిమిది షాపులపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తూకాల్లో తేడాలుంటే ప్రజలు విజిలెన్స్ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. దుకాణదారుల్లో మార్పు రాకపోతే వాళ్ళ లైసెన్స్ రద్దు కూడా చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలో భరత్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధిపై బిజెపి రాజకీయం : ఆర్కాట్

తిరుపతి టౌన్: తిరుపతి అభివృద్ధికి టిటిడి నిధులలో ఒక శాతం వాటాను కేటాయిస్తే దానికి మోకాలడ్డు వేసిన బీజేపీ నాయకులు ప్రతి విషయంలోనూ ఆక్షేపణలు తెలియజేస్తూ తిరుపతి ప్రతిష్టను దిగజారుస్తున్నారని నగరాభివృద్ధి కమిటీ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ విమర్శించారు. బిజెపి తీరుకు నిరసనగా నగర పౌరసమాజం, అఖిల పక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ శనివారం నిర్వహించదలిస్తే, ప్రధానమంత్రి పర్యటన దష్ట్యా ర్యాలీ ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. త్వరలో భారీ ర్యాలీ నిర్వహించే తేదిని తెలియజేస్తామని తెలిపారు.

సీసీ రోడ్లపై చెరువును తలపిస్తున్న వర్షపు నీరు


సిసి రోడ్లపై చెరువులను తలపిస్తున్న వర్షపునీరు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం శ్రీ బొమ్మ రాజపురం గ్రామ పంచా యతీలో ఓ మోస్తారు వర్షం కురవడంతో ఆది ఆంధ్రవాడ, ఎస్టీ కాలనీలలో మురుగునీటి కాలువలు నిండి, సిసి రోడ్లపై మురుగు నీరు చేరడంతో చెరువులను తలపిస్తోంది. ఇప్పటికే పలుమార్లు పంచాయతీ సిబ్బందికి తెలిపినా ఫలితం లేక పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని కోరారు.

కులగణన సర్వేలో వాలంటీర్లు వద్దు..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కుల గణన సర్వేలో వాలంటీర్లను భాగ స్వామ్యం చేయ వద్దని గూడూ రు పట్టణం లోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యం లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు వేమయ్య మాట్లాడు తూ ప్రతి 10 సంవత్స రాలకు ఒకసారి నిర్వహించే కుల గణన ను ఇప్పుడు వాలంటీరులతో ప్రభుత్వం నిర్వహించడాన్ని వ్యతిరేకి స్తున్నామని ఉపాధ్యా యులతో కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైభవంగా కైశికద్వాదశి ఆస్థానం

తిరుమల : కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో శుక్రవారం ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 4.45 నుండి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటత్తురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం ఉదయం 6 నుండి ఉదయం 7.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా బేటి బడావో బేటి బచావో

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లీనా కుమారి ఆధ్వర్యంలో ఎర్ర వా రి పా లె ం కస్తూరిబా గాంధీ పాఠశాలలో బేటి బడావో బేటీ బచావోను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లీనాకుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ చదువుతోపాటు భద్రత ఎంతో అవసరమని , నేటి తరం విద్యార్థినులు ముఖ్యంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అన్ని రంగాలలో పురుషులతో పాటు మహిళలు కూడా విజయం సాధించి ఉన్నత స్థాయికి వెళుతున్నారని నేటి బాలలే రేపటి పౌరులని కొనియాడారు. బాలికల అభివృద్ధి దేశ సౌభాగ్యమని గర్భస్థ శిశు పిండ నిర్ధారణ నేరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


బాలికలకు అవగాహన కల్పిస్తున్న డాక్టరు లీనాకుమారి


నూతనంగా ఎన్నికైన యుటిఎఫ్ మండల నాయకులు

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - బాలాయపల్లి: బాలాయపల్లి మండల యూటిఎఫ్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పి ఫిరోజ్ ఖాన్, అధ్యక్షులు గా సరస్వతి, శ్రీనివాసులు, అసోసియేటివ్ అధ్యక్షులుగా యం నరేంద్రనాథ్ చౌదరి, టి ఉషారాణి, ప్రధాన కార్యదర్శిగా పి కృష్ణమూర్తి, కోశాధికారిగా మన్నేటి చలపతి, జిల్లా కౌన్సిలర్లుగా బి రత్నశేఖర్, వి కామేశ్వరి, ఎస్ శ్రీ హరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నూతన కమిటీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మెమోలు ఇవ్వడం సరికాదు..

ప్రజాశక్తి-పాకాల: జిల్లా విద్యాశాఖ అధికారులు మండలంలోని ఉపాధ్యాయులకు చార్జి మెమోలు ఇవ్వడం సరికాదని బిటిఏ మండల అధ్యక్షుడు జ్యోతి ప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్విఎన్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బిటిఏ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు రామచంద్రయ్య, రామ్మూర్తి సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలలను సందర్శించిన తరువాత ఉపాధ్యాయులకు చార్జి మెమోలు ఇవ్వడం సరికాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాఠశాలలను సందర్శించిన అనంతరం అక్కడ పరిస్థితులను గమనించి బోధనకు మౌలిక వసతులకు కావలసిన సలహాలు సూచనలు ఇచ్చి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఉపాధ్యాయులను వేధించడం వారిని అశాంతికి, అనారోగ్యానికి గురి చేయడం తగదన్నారు. ఉపాధ్యాయులకు రావలసిన పిఆర్సి, డిఏ బకాయిలు, పిఎఫ్ లోన్లు, ఏపీ జిఎల్ఐ, లేవని సమస్యలు పరిష్కరిం చకుండా చార్జ్ మెమోలు ఇవ్వటం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు గుండ్లపల్లి ఆంజనేయులు, విజయ మోహన్, రెడ్డెప్ప, కృష్ణమూర్తి, గణేష్, వెంకటయ్య, రాజేంద్రుడు, రామచంద్ర, శివప్రసాద్, వెంకటస్వామి, వెంకటయ్య పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్, తిరుపతి చాప్టర్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంయుక్తంగా "విమెన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్" అనే అంశంపై నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సెమినార్‌కు ముఖ్య వక్తగా డాక్టర్ విజయలక్ష్మి సక్సేనా, ఐఎస్‌సిఏ మాజీ జనరల్ ప్రసిడెంట్, డాక్టర్ అశోక్ కుమార్ సక్సేనా, మాజీ జనరల్ ప్రెసిడెంట్, ఐఎస్‌సిఏ చీఫ్ ప్యాట్రన్ ప్రొఫెసర్ ఎస్‌పి ఎంవివి విసి డి. భారతి, పోషకులుగా ఐఎస్‌సిఏ తిరుపతి చాప్టర్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ రామమూర్తి, ఎస్‌వియు మాజీ విసి, ప్రొఫెసర్ రజని, రిజిస్ట్రార్ ఎస్‌పి ఎంవివి ఐఎస్‌సిఏ కన్వీనర్ డాక్టర్ కె. పూర్ణచంద్రరావు, కన్వీనర్, తిరుపతి చాప్టర్, ఆర్గనై జింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎ. శ్రీదేవి, ఐపిటి ఎస్‌పిఎంవివి ఆర్గనై జింగ్ కమిటీకి ఐఎస్‌సిఏ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ప్రొఫెసర్ భూపతి నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ కోదండరామస్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటి : శ్రీ కోదండ రామాలయంలో డిసెంబర్ నెలలో పలు విశేష ఉత్సవాలు జరగనున్నాయి. డిసెంబర్ 1, 28 తేదీల్లో పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం జరగనుంది. డిసెంబర్ 2, 9, 16, 23, 30వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు.

చెట్లు కూల్చివేత

- అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం - ఫిర్యాదు చేస్తేనే పట్టించుకుంటాం: ఎఫ్ఆర్ఓ

ప్రజాశక్తి-నాయుడుపేట: 'ప్రకృతిని కాపాడాలి' అంటూ ప్రభుత్వాలు పథకాలు పెట్టి మరి నినాదాలు చేస్తున్న కొందరు కార్పొరేటర్లు నిర్దాక్షణ్యంగా వారికి ఏమాత్రం సంబంధం లేని చెట్లను నరికేసి వారి వ్యాపారాలకు మెరుగులు దిద్దుకుంటున్నారు. ఓ పక్క ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు ప్రజలకు చెట్లను నాటాలంటూ ప్రకృతిని కాపాడాలంటూ ఇంటికో చెట్టు ప్రగతికి మెట్టు అంటూ ప్రజల మనసుల్లో నాటుతుంటే ఇవన్నీ మాకు పట్టవని ధనార్జనే తమకు ధ్యేయం అని నిరూపి స్తున్నారు. కొంతమంది వ్యాపారులు ఇందుకు నాయుడుపేట లోని ఓ సంఘటన సాక్ష్యం. ..జోరుగా వర్షం పడుతున్నా లక్ష్య పెట్టకుండా నాయుడుపేట శ్రీకాళహస్తి బైపాస్ రోడ్ పక్కన నూతనంగా నిర్మించిన కార్తికేయ ఇన్ హోటల్ యాజమాన్యం ప్రభుత్వ స్థలంలో రోడ్డు పక్కన ఎంతోమందికి నీడ నిస్తున్న ఓ చెట్టును ఏ అధికారి వద్ద ఎలాంటి అనుమతులు పొందకుండా నిర్దాక్షిణ్యంగా నరికివేయడం అధికారుల పట్ల, ప్రకృతి పట్ల వారికి ఏమాత్రం బాధ్యత వుందో తెలియజేస్తోంది. ప్రకృతి సంరక్షణకు ఏర్పాటు చేసిన అటవీ శాఖ వ్యవస్థ తమకెలాంటి సంబంధం లేదన్నట్టు వ్యవ హరిస్తోంది. ఈ సంఘటనపై నాయుడుపేట ఎఫ్ఆర్ఓ భాస్కర్ రెడ్డిని వివరణ కోరగా తమకు ఆ చెట్టు ఏ స్థలంలో ఉందో దానికి సంబంధించిన అధికారులు ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే పట్టించుకుంటాం.. మాకె వరూ ఫిర్యాదు చేయలేదు...' అంటూ నిర్లక్ష్య ధోరణితో మాట్లా డటం గమనార్హం. వారిలా స్పందించ డానికి వారు కున్న కారణాలు ఏమిటో వారే తెలపాలి. అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందువల్లే ఎవరి ఇష్టానుసారం వారు చేస్తున్నారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అటవీ శాఖ అధికారులు ఇకనైనా కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.


చెట్లు తొలగించడంతో పచ్చదనం కరువైన రహదారి

ఇంటింటికీ వెళ్లి కులగణన సర్వే చేయాలి: డిఎల్‌డిఓ


సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌డివో సుశీలదేవి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ ఆదేశాలు మేరకు ప్రతి సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వే నిర్వహించాలని తిరుపతి జిల్లా డిఎల్‌డిఓ సుశీల దేవి పేర్కొన్నారు. స్థానిక పురపాలక సంఘం, మండల పరిషత్ కార్యాలయంలో కుల గణన సర్వేపై వార్డు, సచివాలయం కార్యదర్శులు, వాలంటీర్లకు శుక్రవారం శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి ఇంటి యజమానుల వద్దే సమాచారం అడిగి తెలుసుకుని వివరాలు, వారి చేసే పనులు, అద్దె గృహమా సొంత గృహమా? వారి కులాలు వివరాలు రాసుకోవాలని మొత్తం వివరాలను సర్వే చేయాలని తెలిపారు. వాళ్లు ఇంట్లో వున్న సమయంలోనే వాలంటీరు వెళ్లి సర్వే చేయాలన్నారు. 7.01. డౌన్‌లోడ్ చేసుకుని వాటి ద్వారా సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కే ఎల్ ఎంఎన్ రెడ్డి, తహశీల్దారు పరమేశ్వర స్వామి, ఎంఈఓ తిరుమలరాజు, ఈఓఆర్‌డి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

దుస్థితిలో ఆలత్తూరు రోడ్డు

గుంతలలో పేపరు పడవలతో నిరసన

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: గుంతలమయమైన ఆలత్తూరు రోడ్డు దుస్థితిని పట్టించుకోవాలని కోరుతూ టిడిపి, జనసేన నాయకులు పేపరు పడవలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఆలత్తూరు రోడ్డు మార్గంలో ఆలత్తూరు, పిల్లేటి వారి కండ్రిగ , పుతేరి మూడు గ్రామ పంచాయతీలలోని 15 గ్రామాలకు ఈ రహదారి ఉపయోగకరంగా వుంటుందని, ప్రతి అడుగుకు గుంతల మయమైందని, ఈ గుంతలు రెండు నుంచి మూడు అడుగుల లోతులో వుండడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఈ మార్గంలో వస్తున్న ఆలత్తూరు బస్సును రహదారి అధ్వానంగా ఉన్న కారణంగా అప్పుడప్పుడూ నిలిపివేస్తున్నారన్నారు. ప్రతిరోజూ 40 నుంచి 60 టన్నుల మెటల్ టిప్పర్లు సుమారు 100 టిప్పర్లు ఈ రహదారిపై తిరుగుతున్నాయని, వాటి ద్వారా మెటల్ రాయల్టీ వసూలు చేస్తున్న ప్రభుత్వం కనీసం రహదారికి మరమ్మతులు కూడా చేయకుండా వదిలేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, వైసిపి నాయకులు మెయింటెనెన్స్ నిధులు కూడా విడుదల చేయించలేని అసమర్థత కారణంగా అధ్వాన స్థితికి ఈ రహదారి అద్దం పడుతోందని, అధిక లోడుతో వెళుతున్న టిప్పర్ల వద్ద అధికారులు మామూళ్ల వసూళ్లు చేసుకుంటూ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. నిరసనగా బుచ్చినాయుడు కండ్రిగ మండల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఈ రహదారి గుంతలలో పేపర్ పడవలతో నిరసన తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు యం సుధాకర్ నాయుడు, క్లస్టర్ కన్నయ్య నాయుడు, సురేష్ బాబు, రవీంద్రబాబు, సుధాకర్, ఆనంద్, కుమార్ శెట్టి, గురవయ్య, బాబు, వీర రాఘవులు, హరి, శ్రీనివాసులు, చిరంజీవి రెడ్డి జనసేన నాయకులు నవీన్, బాలాజీ పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వాడకం వాతావరణ కాలుష్యానికి ప్రమాదకరం

ప్రజాశక్తి - క్యాంపస్ : నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకం ద్వారా వాతావరణ కాలుష్యానికి పెను ప్రమాదం వాటిల్లే అవకాశం ఎక్కువగా ఉందని ఏబిసిడి కోఆర్డినేటర్, మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య కే సుధారాణి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూఎడ్యుకేషన్ ద్వారా 'యాంటీ ప్లాస్టిక్ అని అవేర్నెస్ కార్యక్రమం' ను ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య కే. సుధారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య కె. సుధారాణి మాట్లాడుతూ ప్లాస్టిక్ మన నిత్య జీవితంలో భాగమైపోయిందన్నారు. బకెట్లో, డబ్బాలు, సంచులు ఇలా ఇంట్లో ఏ మూలాన చూసినా కచ్చితంగా ఏదో ఒక రూపంలో ప్లాస్టిక్ కనిపిస్తూనే ఉన్నాయన్నారు. అయితే ప్లాస్టిక్ వస్తువులు కన్నా ప్లాస్టిక్ సంచీల వాడకం ప్రమాదకరమన్నారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ కే సునీల్ మాట్లాడుతూ మనం ప్రస్తుత కాలంలో ఎదుర్కొంటున్న అతి పెద్ద ముప్పు కాలుష్యం అన్నారు. కాలుష్యం విసర్జిత పదార్థాల ద్వారా నగరాలలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలకు చాలావరకు ప్లాస్టిక్ బాధ్యత వహిస్తుందన్నారు. గత కన్నీళ్లుగా ప్లాస్టిక్ వాడకం అనేది విపరీతంగా పెరిగిపోయిందని, ప్లాస్టిక్ చట్టం ద్వారా నియంత్రించినప్పుడు ఆచరణలో అది ప్రభావంతంగా ఉంటుందా? అనే సందేహం ఉందన్నారు. దీని వల్ల కలిగే పర్యావరణ సమస్యలను సీరియస్ గా తీసుకోకపోతే సమస్యలు మరింత తీవ్రమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ కె అబ్రహం మాట్లాడుతూ ఎక్కడ చూసినా ఏ అవసరానికైనా ప్లాస్టిక్ డబ్బాలు, పాలిథిన్ కవర్లే వాడుతూ అవసరం తీరాక బయటపడేయడం వల్ల ప్లాస్టిక్ కాలుష్యం అంత కంతకూ పెరిగి పర్యావరణం కలుషితం అవు తోందన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.సునీత, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కాలుష్యంపై ప్రసంగిస్తున్న వక్తలు


ప్రాంగణ ఎంపికలో విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్న కంపెనీలు

ఎన్‌బికే ఆర్ఐఎస్టీలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి -కోట : కోట మండలం విద్యానగర్ ఎన్‌బికే ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్ లోని బహుళజాతి సంస్థ ఆర్సించర్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు బి.టెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న అన్ని బ్రాంచీలవారు మొత్తం 454 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఎంపికలను నిర్వహించడానికి చెన్నైకి చెందిన హక్షన్, అఖిలన్ విచ్చేశారు. విద్యార్థులకు ఆన్‌లైను పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సంచాలకులు డావి విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్‌బికే ఆర్ఐ ఎస్టీలో ఇప్పటి వరకు ఏడు కంపెనీలు వచ్చాయని అన్ని బహుళజాతి కంపెనీలు కళాశాలకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కళాశాలలో ఉన్న వనరులు, అక్రిడిటేషన్స్ వల్లే కంపెనీలు కళాశాలకు వస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి వి కిషంధర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ఆక్సంచర్ తోపాటు, టెక్ మహేంద్ర, జేసీఎస్, సీడీకే గ్లోబల్ వంటి పలు కంపెనీలు కళాశాలకు రానున్నట్లు తెలిపారు.

జగనన్న పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి: మంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జగనన్న పాలనలోనే రాష్ట్రంలో త్వరితగతిన సంక్షేమం, అభివృద్ధి సాధ్యమైందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్ కె రోజా అన్నారు. పుత్తూరు మండలం కృష్ణసముద్రం సచివాలయంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వంను నిర్వహించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల పేదలు, మధ్యతరగతి వర్గాలకు కలుగుతున్న ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృష్ణసముద్రం సచివా లయ పరిధిలో అభివృద్ధి సంక్షేమం జరిగిందన్నారు. వీటిని అంకెలతో ప్రత్యక్షంగా చూపుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు తెలుసుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఇలాంటి పనులు జరగలేదన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమాన్ని అందించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. సీఎం జగన్‌తోనే రాష్ట్ర సాధికారత సాధ్యమన్నారు. మీ ఆశీస్సులు, దీవెనలు ఎప్పుడూ తమకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణ సముద్రం గ్రామ ప్రజలు మంత్రి రోజాకు పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు జేసి ఎస్ కన్వీనర్, పార్టీ కన్వీనర్, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంటింటికీ కరపత్రాలు అందిస్తున్న మంత్రి రోజా


బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కాటూరు పంచాయతీలో శుక్రవారం బి ఎస్ కండ్రిగ మండలం పరిధిలోని కాటూరు సచివాలయంలో వైసిపి మండల కన్వీనర్ ఆరని విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో జగనే ఆంధ్రప్రదేశ్ కి ఎందుకు కావాలి?' కార్యక్రమ డిస్‌ప్లేను ఆవిష్కరించి అట్టహాసంగా ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ కి జగన్‌నే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆరని విద్యానాథ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి, మండల్ వైసీసీ ఎంపీపీ బండి, ఎంపీటీసీ డివి నరసింహారావు, మునికృష్ణారెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ అందిన భాస్కర్ రెడ్డి, కొత్తపాలెం సర్పంచి హరిప్రసాద్ లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడిన తర్వాత జెండా ఎగరవేసి గడపగడపకు తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సురిటి పల్లి దేవస్థానం సభ్యులు అజయ్ కుమార్ రెడ్డి, పల్లమాల సచివాలయం కన్వీనర్ నిరంజన్ రెడ్డి , మాజీ ఎంపీటీసీ దేవత సంజీవ, కె లక్ష్మీపతి రెడ్డి , కంచన పుత్తూరు సచివాలయ కన్వీనర్ శేఖర్, పి ధనంజయ డి మోహన్ రెడ్డి ఏ పద్మనాభయ్య చెంచయ్య , శ్రీ సాయి సి అచ్చయ్య, ఎస్ బాబు, ఏం గంగయ్య, జై మనీ, ఎం వెంకటేష్ కే రాంబాబు, సచివాలయ సిబ్బంది, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు గృహసారథులు వైసిపి కార్యకర్తలు వైసిపి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు అందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


నాయుడుపేటలో

నాయుడుపేట: 2019ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే 99 శాతం అమలు చేసిన ఘనత సిఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని నాయుడుపేట మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి ఓట్టూరు కిషోర్ యాదవ్ అన్నారు. నాయుడుపేట మండలంలోని కల్లిపేడు సచివాలయంలో శుక్రవారం ఓట్టూరు కిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో వై ఎపి నీడ్స్ జగన్ ?'ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాలు పథకాల్లో భాగంగా కుల మత రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందజేసి వారి జీవితాల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వెలుగు నింపారన్నారు. రాష్ట్రంలో నూతనంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుద్యోగులకు గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ యువతను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాలు అమలు చేసిన కరపత్రాలు పంపిణీ చేశారు. అత్తికాయల సుధాకర్ సుంకర పవన్, అత్తి కాయల హరినాథ్, వైసీపీ నాయకులు ముమ్మడి నారాయణ, పలకాల కృష్ణయ్య, అత్తికాయలు శీనయ్య,ఈఓపిఆర్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి: ఎంఈవో

ప్రజాశక్తి -కెవిబి పురం: విద్యార్థులకు మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో లక్ష్మీపతి భోజన కార్మికులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రాయపెడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ప్రార్థనలో పాల్గొని పలు సలహాలు, సూచనలు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరు ముద్దలో మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించ కపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో లక్ష్మీపతి


విద్యార్థినులకు శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కల్పిస్తున్న జెవివి నాయకులు

జెవివి ఆధ్వర్యంలో ఎవల్యూషన్ డే

ప్రజాశక్తి -రేణిగుంట: జెవివి ఆధ్వర్యంలో రేణిగుంట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల బాలుర ఉన్నత పాఠశాలలో ఎవల్యూషన్ డేను శుక్రవారం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డార్విన్ 1859 నవంబరు 24 న "ది ఆరిజిన్ ఆఫ్ స్పీసిస్ ' జీవపరిణామ సిద్ధాంతం తెలిపే గ్రంథాన్ని వెలువరించిన రోజు అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఎవల్యూషన్ డేగా జరుపుతారన్నారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ఓ వెంకటరమణ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రపంచంలో డార్విన్ ప్రతి పాదించిన పరిణామ సిద్ధాంతం మైలురాయి, నేడు కేంద్ర ప్రభుత్వమే డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశం నుండి తీసివేయడం మనుధర్మ మౌఢ్య భావాలతో నింపే ప్రయత్నం అన్నారు. మన ప్రజల ప్రగతికి అవరోధంగా నిలుస్తుందని, దేశ ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ప్రగతి బాటలో పయనించాలంటే ఖచ్చితంగా ఇలాంటి శాస్త్రీయ ఆలోచన పెంచే ప్రయత్నమే ఈ కార్యక్రమం అన్నారు. జనవిజ్ఞాన వేదిక రేణిగుంట నాయకులు ఇమామ్ నెచురల్ సెలక్షన్ వివరించారు. ఈ కార్యక్రమంలో సహజ, ఉపాధ్యాయులు లావణ్య, విజయ, గజేంద్ర విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమంతో పలకరిస్తున్నాం: వెందోటి

ప్రజాశక్తి -బాలాయపల్లి : సంక్షేమ పథకాలతో పలకరిస్తున్నామని మండల వైసీపీ అధ్యక్షులు వెందోటి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలంటే..కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించామని అధికారులు చెప్పారు. ఇక గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయం అధ్యక్షులు వెంకట బంగారు ప్రసాద్ చౌదరి, వైసిపి నాయకులు సర్వేపల్లి సురేష్, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

శబరిమలకు వెళ్లిన భక్తుడు మృతి


మృతుడు భాస్కర్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -ఏర్పేడు: శబరిమలకు వెళ్లిన భక్తుడు మృతి ఎందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కందాడ గ్రామంలో బి. భాస్కర్ (47) అయ్యప్ప మాల భక్తుడు రెండు రోజుల క్రితం శబరిమలకు వెళ్లాడు. పంబ నుంచి శబరిమలకు నడిచి వెళ్లే క్రమంలో గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో గుండె నొప్పితో తుది శ్వాస విడిచాడు. అతను కుటుంబీకులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జాతీయ లోకాదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జ్ రాఘవేంద్ర పేర్కొన్నారు. పుత్తూరు కోర్టు ఆవరణలో డిసెంబర్ నెల 9 వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని కోరారు. పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్ సి రాఘవేంద్ర శుక్రవారం న్యాయ వాదులతో సబ్ కోర్ట్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు దాని పై అప్పీల్ ఉండదని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చని రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో ప్రీ లిటిగేషన్ కేసులను (కోర్టు లో పెండింగ్ లేని కేసులు)రాజీ చేస్తారని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేలా న్యాయ వాదులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సి జానకి,అదనపు జూనియర్ సివిల్ జడ్జి. వి గోపాలకృష్ణ, పుత్తూరు న్యాయ వాదుల సంఘం కార్యదర్శి మురుగేష్ రెడ్డి, ఇతర నాయవాదులు పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న రవికుమార్

కాపు సంక్షేమ సేన తిరుపతి జిల్లా కార్యదర్శిగా రవికుమార్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి కాపు సంక్షేమ సేన జిల్లా కార్యదర్శిగా రవికుమార్ నియమితులైనట్లు తిరుపతి చిత్తూరు జిల్లాల మధుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చేగోడీ హరీ రామ జోగయ్య ఆదేశాల మేరకు జె .రవికుమార్ నియమించినట్లు పేర్కొన్నారు. కాపు సంక్షేమం అభివృద్ధి కోసం రవికుమార్ తన సేవలను అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కాపు సంక్షేమ సేన అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలి దాతృత్వం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం పాగాలి ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులందరికీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ భోజనం ప్లేట్లు, గ్లాసులు అందిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏర్పేడు మండల విద్యాశాఖ అధికారి ప్రేమలత మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు బోధించే విధానం లో ప్రత్యేక శ్రద్ధ కనిపరుస్తున్నారని దానితోపాటు సామాజిక సేవలో భాగంగా ఆమె విద్యార్థులందరికీ భోజనం చేసేటప్పుడు సౌకర్యంగా ఉండే విధంగా స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందించడం అభినందనీయకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు సి ఆర్ పి సురేష్ పాల్గొన్నారు.

2, 7 తేదీల్లో వేదనారాయణస్వామి బాలాలయం

తిరుపతి సిటి : నాగలాపురం శ్రీ వేదనారాయణస్వామివారి ఆలయంలో డిసెంబరు 2 నుండి 7వ తేదీ వరకు 'బాలాలయం' శాస్త్రోక్తంగా జరగనుంది. సాధారణంగా గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం "బాలాలయం" చేపడతారు. ఇందుకోసం ఆలయంలో నమూనా ఆలయం ఏర్పాటుచేసి గర్భాలయంలోని మూలవర్ల చిత్రపటాలను ఏర్పాటు చేస్తారు.